# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



వెంకమ్మగూడ పాఠశాలలో విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈవో లక్ష్మణ్ నాయక్

షాబాద్, జూన్ 23: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని షాబాద్ మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణ్ నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని వెంకమ్మగూడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వెంకమ్మగూడ గ్రామంలోని విద్యారులందరూ ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో జాయిన్ అవ్వడం ఎంతో శుభ పరిణామమన్నారు. ఈ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను జాయిన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సింహాద్రి నాయుడు, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి క్రిష్ణ, అంజయ్య, అంగన్‌వాడీ టీచర్ వినోద, గ్రామస్తులు నర్సింహులు, బుచ్చయ్య, కుమార్, మహేందర్ పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నందిగామ, జూన్ 23 : మండల పరిధిలోని మామిడిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో 2005-06 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు సోమవారం ఈదులపల్లిలోని ఫాం హౌస్‌లో ఆత్మీయ సమ్మేలనం నిర్వహించారు. ఎన్నో ఏండ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకున్నారు. అప్పట్లో పాఠ్యాంశాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు.

# ఎస్ఎఫ్ఐ మహాసభలను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు

షాద్‌నగర్‌టౌన్, జూన్ 23 : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 30 వరకు కేరళలో నిర్వహించే 18వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం సభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల హక్కులు, సామాజిక న్యాయం, ప్రగతిశీల విద్యా విధానాల కోసం ఎస్ఎఫ్ఐ పోరాడుతున్నన్నారు. కార్యక్రమంలో నాయకులు నాయకులు సుమయిర్, శివశంకర్, అదిల్, హాజీ, నితిన్‌కుమార్, రాకేశ్, సిద్దు, జాఫర్, వినయ్ పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ
- కేశంపేట జెడ్పీహెచ్ఎస్‌లో మాదక ద్రవ్యాలపై అవగాహన



కేశంపేట : సమావేశంలో మాట్లాడుతున్న షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ

కేశంపేట, జూన్ 23 : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ అన్నారు. కేశంపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సీఐ నరహరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాంటి డ్రగ్స్‌పై అవగాహన సదస్సులో ఏసీపీ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాలు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఎస్సై రాజ్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విద్యావతి, ఉపాధ్యాయులు గోవర్ధనచారి, శంకర్, వెంకట్‌ప్రసాద్, నరేందర్‌రెడ్డి, శ్రీలత, సునీత, ఇందిర, శారద, శ్రీదేవి, మోసెస్, విద్యార్థులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**కడ్తాల్ :** మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సీఐ గంగాధర్ అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా సోమవారం మండల పరిధిలోని అన్మాస్‌పల్లిలో ఉన్న ఎర్త్ సెంటర్‌లోని విద్యార్థులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అనంతరం ఈ నెల 26న మండల కేంద్రంలో నిర్వహించే అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీకి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ర్యాలీలో మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని ఆయన కోరారు. అనంతరం ఎర్త్ సెంటర్ ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. మండల కేంద్రంలో నిర్వహించే ర్యాలీలో ముఖ్య అతిథిగా సీజీఆర్ వ్యవస్థాపకురాలు లీలమ్మ పాల్గొంటారని సీజీఆర్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్సై బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఇంద్రారెడ్డి, జనార్దన్‌రెడ్డి, భీముడు, సీజీఆర్ ప్రతినిధులు జ్ఞానేశ్వర్, రజనీకాంత్ పాల్గొన్నారు.

**నందిగామ :** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో సోమవారం విద్యార్థులకు మత్తు, మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు ఇచ్చే గంజాయి, డ్రగ్స్, మద్యం తదితర పదార్థాలకు అలవాటు పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ఎక్కడైనా గంజాయి వినియోగిస్తున్న సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్సై దేవరాజు, హెచ్ఎం సుధాకర్, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, పాల్గొన్నారు.

**ఆమనగల్లు :** మాదక ద్రవ్యాల అలవాటుతో భవిష్యత్తు నాశనం అవుతుందని, వాటి నివారణకు సమష్టిగా కృషి చేయాలని ఎస్సై వెంకటేశ్ సూచించారు. ఆమనగల్లులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఎస్సై ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్ వినియోగిస్తే కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్‌ను విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే తెలియజేయలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

**కొందుర్గు:** విద్యార్థులు యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని షాద్ నగర్ రూరల్ సీఐ నరసయ్య అన్నారు. చౌదరిగూడా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాలపై అవగాహన సదస్సులో సీఐ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సై విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సివిల్ కోర్టు న్యాయమూర్తిగా విజయ్ కుమార్

చేవెళ్ల టౌన్, జూన్ 23 :చేవెళ్ల జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తిగా సోమవారం విజయ్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు విజయ్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో చేవెళ్ల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ నర్సింహులు, స్పోర్ట్స్ సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి, ఏజీపీ, లేడీ రీప్రెజెంటర్ గీత వనజాక్షి, ట్రెసరర్ రవీందర్ రెడ్డి, లైబ్రేరియన్ మల్లేశ్, ఎక్జిక్యూటివ్ మెంబెర్స్ తలారి ప్రకాశం, శివరాజ్ గౌడ్, సీహెచ్ రవీందర్, ప్రదీప్ రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

## నాలాల పరిశీలన

తుర్కయాంజాల్, జూన్ 23 : మున్సిపాలిటీ పరిధిలోని మాసబ్ చెరువు, దిలావర్ ఖాన్ చెరువు, ఈదుల చెరువుల నాలాలను సోమవారం ఇబ్రహీంపట్నం డివిజన్ ఇరిగేషన్ డీఈ చెన్నకేశవరెడ్డి, ఏఈ వంశీధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా నాలాలలో పూడికతీత తీయడానికి నాలాలను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ భూముల కౌలుకు నేడు వేలం పాట

చేవెళ్ల టౌన్, జూన్ 23 : వేంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన వ్యవసాయ భూములను కౌలు కోసం వేలంపాట నిర్వహిస్తున్నామని ఈవో నరేందర్, వ్యవస్థాపక ధర్మకర్త దేవుని వామనాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గంలోని చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్ మండలాల్లోని కుమ్మెర, ఖానాపూర్, కేసారం, మల్కాపుర్, పామెన, గుండాల, పెద్దమంగళారం, శ్రీరాంనగర్, మల్లారెడ్డిగూడ, బొబ్బిలిగాం, తాళ్లపల్లి,రేగడి దోసవాడ, చందనెల్లి, సోలిపేట్ గ్రామాల్లోని ఆలయ వ్యవసాయ భూములను కౌలు కోసం వేలం పాట నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వేలం పాట దేవస్థానం ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న రైతులు రూ.2వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు.

## రేషన్‌కార్డు లబ్ధిదారుల ఎంపికపై అవగాహన

కేశంపేట, జూన్ 23 : ప్రజాపాలనలో కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను లబ్ధిదారులుగా ఎంపిక చేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం కేశంపేట తహసీల్దార్ ఆజంఅలీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ఆవరణలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, డీలర్లతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండలానికి 2600 కొత్త రేషన్‌కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారు గతంలో తమ కుటుంబ సభ్యులకు ఉన్న రేషన్‌కార్డులో నమోదై ఉన్నారన్నారు. కొత్త కార్డు కావాలంటే పాత రేషన్‌కార్డులో పేరును తొలగించాల్సి వస్తుందని, ఈ విషయమై లబ్ధిదారుల అభిప్రాయంతోపాటు ఆధార్ కార్డు, రేషన్‌కార్డు నంబర్‌ను యాప్‌లో పొందు పరచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కిష్టయ్య, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



కేశంపేట : విద్యార్థులకు నోటుపుస్తకాలు అందజేస్తున్న శివశరణి ఫౌండేషన్ సభ్యులు

కేశంపేట, జూన్ 23 : మండల పరిధిలోని కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శివశరణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. దివంగత శివలింగప్ప శరణమ్మల జ్ఞాపకార్థం విద్యార్థులకు నోటు పుస్తకాలు, కళాశాల లైబ్రరీకి బీరువాను అందజేశామని ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జగదీశ్వర్, శ్రీధర్, శంకర్, సాయి లు, బాలరాజ్, అంజయ్య, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

**తల్లారంలో..**

**చేవెళ్ల రూరల్ :** మండల పరిధిలోని తల్లారంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం గ్రామానికి చెందిన అంబేద్కర్ యువజన సంఘం సభ్యుడు కౌకుంట్ల దీపక్ ఆర్థిక సౌజన్యంతో నోట్ పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా దీపక్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యతో రాణించి ఉతన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**మంతన్ గౌరెల్లిలో..**

**యాచారం :** మండల పరిధిలోని మంతన్ గౌ రెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమం లో నాయకులు చందు నాయక్, జంగయ్య, విప్లవ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు. అలాగే మేడిపల్లి గ్రామానికి చెందిన గడ్డం రవి అనే ఉపాధ్యాయుడు చిన్నప్పుడు చదువుకున్న పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పెన్నులు పెన్సిళ్లను అందజేశారు.

**మాలేపల్లిలో..**

**ఆమనగల్లు :** దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సంఘం సేవకుడు కల్లు విక్రమ్ రెడ్డి అన్నారు. సోమవారం మాలేపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం గ్రామ సంఘ సేవకుడు కల్లు విక్రమ్ రెడ్డి సొంత నిధులతో వి ద్యార్థులకు బ్యాగ్‌లు, నోట్‌బుక్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విక్రమ్‌రెడ్డిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జగన్, పంచాయతీ కార్యదర్శి పవన్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు విజయ, అంగన్‌వాడీ టీచర్ రాములమ్మ, యువకులు పాల్గొన్నారు.



యాచారం : మంతన్ గౌరెల్లి లో విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కడ్తాల్, జూన్ 23 : మండల పరిధిలోని న్యామతాపూర్ గ్రామానికి చెందిన నూ కం లక్ష్మయ్య ఆరు నెలల క్రితం కడ్తాల్ పట్టణంలో తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. బాధితుడు అదే రోజు తన సెల్‌ఫోన్ పోయిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను వెతికి పట్టుకున్నాడు. ఈ మేరకు సోమవారం కడ్తాల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ గంగాధర్ బాధితుడికి సెల్‌ఫోన్‌ను అప్పగించారు. సాంకేతిక పరిజ్ఞానంతో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అప్పగించడంలో కృషి చేసిన కానిస్టేబుల్ రాంకోటిని సీఐ ప్రత్యేకంగా అభినందించారు. పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను అప్పజెప్పిన పోలీసులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

## బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలి

తుర్కయాంజాల్, జూన్ 23: తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని సంఘీనగర్ నుంచి ఉమెన్స్ కాలేజ్ (కోటి) వరకు వెళ్లే 293(ఎస్) బస్సు సర్వీస్‌ను వెంటనే పునరుద్ధరించాలని మాజీ కౌన్సిలర్ కరాడి శ్రీలత మిధాని బస్ డిపో మేనేజర్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న కార్యదర్శి

కొందుర్గు, జూన్ 23 : కొందుర్గు మండల కేంద్రంలో అక్రమంగా సాగుతున్న నిర్మాణాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శి అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కనే ఓ వ్యక్తి నిర్మాణ పనులు చేపట్టాడు. తనకున్న స్థలం కంటే ఎక్కువగా నిర్మాణం చేస్తుండడంతో గ్రహించి అడ్డుకున్నట్లు గ్రామ కార్యదర్శి సురేఖ తెలిపారు. ఆ స్థలానికి సంబంధించిన పత్రాలు ఏమైనా ఉంటే గ్రామ పంచాయతీకి సమర్పించాలని అనుమతి పొందిన తర్వాతనే నిర్మాణ పనులు చేపట్టాలని ఆమె ఆదేశించారు. నిర్మాణదారుడు మాట వినకపోవడంతో కార్యదర్శి పోలీసులను ఆశ్రయించారు. పోలీసుల రంగప్రవేశంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

# ఒకటో వార్డులో తాగునీటి సమస్యను అధిగమిస్తాం



కుమ్మరిగూడలో పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య దేవేందర్‌యాదవ్


కొత్తూరు, జూన్ 23 : మున్సిపాలిటీలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని కొత్తూరు మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యాదేవేందర్‌యాదవ్ అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీలోని ఒకటో వార్డు కుమ్మరిగూడలోని కమ్మరి అశోక్ ఇంటి నుంచి పిచ్చకుంట్ల అరుణ ఇంటి వరకు తాగునీటి పైప్‌లైన్ పనులకు సోమవారం ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్ పీర్లగూడెం మాధవీ గోపాల్‌గౌడ్, సోమ్లానాయక్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, బ్యాగరి యాదయ్య, ఆనంద్, కుమ్మరి వెంకటయ్య, కుమ్మరి ఆంజనేయులు, పీర్లగూడెం శ్రీశైలం, కుమ్మరి వెంకటేశ్, బండారి రామకృష్ణ, లక్ష్మయ్య, గొల్లూరి శ్రీను పాల్గొన్నారు.

# గోపులారంలో రైతులకు విత్తనాల పంపిణీ




రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ శ్రీనివాస్

శంకర్ పల్లి, జూన్ 23 : మండల పరిధిలోని గోపులారంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ పొడవు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గండిపేటకు చెందిన రాక్‌వెల్ ఇంటర్నేషనల్ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు కలిసి సోమవారం వరి సాగుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో శ్రీ తేజ, అనిల్ కుమార్, వినాయక్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



యాదవ, కురుమ ఎమ్మెల్యేలో ఒకరికి మంత్రి పదవి కేటాయించాలని కోరుతూ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ గొల్ల కురుమ సంఘం నాయకులు. - ఆదిబట్ల, జూన్ 23



మండల పరిధిలోని మంతన్ గౌరెల్లి, మాల్, నల్లవెల్లి, తమ్మలోనిగూడా, చింతపట్ల గ్రామాల్లో సోమవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధికారులు, స్థానిక నాయకులతో కలిసి రూ.246.50లక్షల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. - యాచారం, జూన్ 23

## పట్టపగలే రెచ్చిపోయిన దొంగలు

యాచారం, జూన్ 23 : పట్టపగలే దొంగలు రెచ్చిపోయారు. అందరూ చూస్తుండగానే మహిళ మెడలో నుంచి మూడు తులాల పుస్తెలతాడును గుర్తుతెలియని దుండగులు అపహరించుకుపోయారు. ఈ ఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని తక్కల్లపల్లి గేటు వద్ద సోమవారం జరిగింది. సీఐ నందీశ్వర్ రెడ్డి తెలిపిన వివరాలు.. మాడుగుల మండల పరిధిలోని అప్పరెడ్డిపల్లికి చెందిన బండ పార్వతమ్మ (58) మండలంలోని మేడిపల్లిలో ఉన్న తన బంధువుల ఇంటికి వచ్చింది. తిరిగి తన స్వగ్రామానికి వెళ్లేందుకు తక్కలపల్లి గేటు వద్ద సాగర్ రహదారిపై బస్సు కోసం ఎదురు చూస్తున్నది. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తుల్లో వెనకాల కూర్చున్న ఓ వ్యక్తి ఆ మహిళ మెడలో ఉన్న మూడు తులాల పుస్తెలతాడును బలంగా లాగి అపహరించాడు. వెంటనే వారు బైకుపై అక్కడి నుంచి వేగంగా పరారయ్యారు. గుర్తుతెలియని దుండగులు పుస్తెలతాడుతో హుడాయించడంతో బాధిత మహిళా లబోదిబోమంటూ బోరున విలపించింది. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నిందితులను వీలైనంత త్వరగా పట్టుకుంటామని సీఐ తెలిపారు.

## పాలశీతలీకరణ కేంద్రంలో సీసీ కెమెరాలు చోరీ

కడ్తాల్, జూన్ 23 : మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రంలో సీసీ కెమెరాలు, ఎన్‌వీఆర్ డివైజ్ చోరీకి గురైన ఘటన జరిగింది. సీఐ గంగాధర్ తెలిపిన వివరాలు.. ఈ నెల 21న రాత్రి కడ్తాల్‌లోని విజయ పాలశీతలీకరణ కేంద్రానికి సంబంధించిన ల్యాబ్ గదిలో ఉన్న రెండు సీసీ కెమెరాలు, హార్డ్‌డిస్కును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. రోజుమాదిరిగానే ఆదివారం ఉదయం పాల శీతలీకరణ కేంద్రం సిబ్బంది ల్యాబ్‌లో వచ్చి చూడగా... గదిలోని సీసీ కెమెరాలు, హార్డ్ డివైజ్ కనిపించలేదు. వెంటనే సిబ్బంది విషయాన్ని పాలశీతలీకరణ కేంద్రం ఇన్‌చార్జి మేనేజర్ ఉదయశ్రీకి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉదయశ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను పట్టుకుంటామన్నారు.

# జీవాలకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



లక్ష్మారావు గూడలో జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి

షాబాద్, జూన్ 23 : రైతులు తమ జీవాలకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని రేగడి దోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని లక్ష్మారావుగూడలో గొర్రెలు, మేకలకు చిటుక వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో గొర్రెలు, మేకలకు చిటుక వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ జీవాలకు టీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాలరాజ్, శ్రీను, కృష్ణమూర్తి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గట్టుఇప్పలపల్లిని మండలంగా సాధించే పోరాటం ఆగదు



గట్టుఇప్పలపల్లిలో నిరాహార దీక్ష చేస్తున్న గ్రామస్తులు

కడ్తాల్, జూన్ 23 : గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం ఆగదని మండల సాధన సమితి నాయకులు అన్నారు. గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో గట్టుఇప్పలపల్లిని మండలంగా ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల సాధన సమితి నాయకులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి



శ్రీరాంనగర్‌లో మొక్కలు నాటుతున్న నాయకులు

మొయినాబాద్, జూన్ 23 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని శ్రీరాంనగర్ మాజీ సర్పంచ సన్‌పల్లి ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని శ్రీరాంనగర్, చిలుకూరు తదితర గ్రామాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీరాంనగర్‌లో నాయకులు సుధాకర్‌రెడ్డి, శివశంకర్, చిలుకూరులో అమరేందర్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, ప్రవీణ్, చిలుకూరులో మాజీ ఉపసర్పంచ్ గున్నాల గోపాల్‌రెడ్డి, నాయకులు శ్రీరాములు పాల్గొన్నారు.

## మా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలి

ఆదిభట్ల, జూన్ 23 : మా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి పట్టాదారు పాస్ బుక్కులు మంజూరు చేయాలని ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని రాందాస్‌పల్లి గ్రామానికి చెందిన రైతులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 41లో ఎంతో మంది రైతులు కబ్జాలో ఉండి వ్యవసాయం చేసుకుంటున్నామని తెలిపారు. అందులో 1251 ఎకరాల భూమి ఉందన్నారు. ఆ భూమిని నిషేధిత జాబితాలో చేర్చారని తెలిపారు. ఈ విషయమై రెండేండ్లుగా అధికారులకు విన్నవిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా వెంటనే సర్వే చేయించి మాకు న్యాయం చేయాలని వారు కోరారు.

## సైఫాబాద్ పోలీసులకు అభినందన

సిటీబ్యూరో, జూన్23(నమస్తే తెలంగాణ): డయల్ 100కు కాల్ చేసిన వెంటనే స్పందించి పోగొట్టుకున్న బ్యాగును యజమానికి అప్పగించిన సైఫాబాద్ పోలీసులను నగర సీపీ సీవీ ఆనంద్ అభినందించారు. సోమవారం ఉదయం లక్డీకాపూల్ బస్‌స్టాప్ నుంచి ఒక బ్యాగు పోయిందంటూ డయల్ 100కు సమాచారం రాగా అప్రమత్తమైన పోలీసులు తనిఖీ నిర్వహించి పోగొట్టుకున్న బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. అందులో 8తులాల బంగారం, రూ.15000 నగదు, మొబైల్‌ఫోన్, విలువైన వస్తువులు ఉన్నాయి. స్వాధీనం చేసుకున్న బ్యాగును సంబంధిత యజమానికి అప్పగించారు. ఈ సందర్భంగా సైఫాబాద్ పీఎస్ పెట్రో కార్ 1లో పనిచేస్తున్న కానిస్టేబుల్ విజయ్‌కుమార్, పురుషోత్తంకుమార్‌లను సీవీ ఆనంద్ నగదు బహుమతితో సత్కరించి ప్రోత్సాహక సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సైఫాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ పాల్గొన్నారు.

## సర్దార్ నగర్ తైబజార్ వేలం రూ. 2.21లక్షలు

షాబాద్, జూన్ 23 : సర్దార్‌నగర్ తైబజార్ బహిరంగ వేలంలో రూ. 2.21లక్షలు పలికినట్లు పంచాయతీ కార్యదర్శి విజయసింహ తెలిపారు. సోమవారం ఉదయం మండల పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తైబజార్ బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో మొత్తం ఐదు గురు పాల్గొన్నారు. మన్మర్రి గ్రామానికి చెందిన బండ వెంకట్ రెడ్డి రూ. 2.21లక్షలు పాట పాడి తైబజార్‌ను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.